క్లుప్తంగా

నైపుణ్యాన్ని మరింత పెంపొందించుకోవాలి



కొల్లిపర: విద్యార్థులు వివిధ సంస్థలు నిర్వహిస్తున్న టాలెంట్ టెస్ట్‌ల్లో పాల్గొని ఎప్పటికప్పుడు వారి విజ్ఞానం, నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని జెవిఎస్ క్రాంతి కోచింగ్ సెంటర్ డైరెక్టర్ విజయశేఖర్ అన్నారు. మండల కేంద్రం కొల్లిపర గ్రామంలో ఏపీజే అబ్దుల్ కలాం, జె.వి.ఎస్. క్రాంతి కోచింగ్ సెంటర్, ఎస్ఎస్ కంప్యూటర్ వారి ఆధ్వర్యంలో శుక్రవారం 120 మంది 10వ తరగతి విద్యార్థులకు మండల స్థాయి టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ఈ టెస్ట్‌లో ప్రథమ బహుమతిగా బి.మానసకు రూ.1116, ద్వితీయ బహుమతి ఎస్.శ్రీనిధికి రూ.516, తృతీయ బహుమతి జి.దీక్షిత, కె.మోషేకు రూ.516 నగదు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో ఎస్కె ఖాజా, టి.రమేష్, ఎ.చంద్రశేఖర్, విద్యార్థులు పాల్గొన్నారు.

పిరమిడ్ స్పిరిచ్యువల్ మూవ్‌మెంట్ వార్షికోత్సవం



తెనాలి: పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ మూవ్‌మెంట్ (పీఎస్ఎస్ఎం) తెనాలి వసుధైక కుటుంబం తృతీయ వార్షికోత్సవం శుక్రవారం కొత్తపేటలోని శ్రీరాధాకృష్ణ కల్యాణమండపంలో నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ధాన్యం, ధ్యానుల అనుభవాలు, సాంస్కృతిక కార్యక్రమాలను జరిపారు. ధ్యాన, శాకాహార, పిరమిడ్ జగత్‌లే పరమలక్ష్యంగా భూమిపై అజ్ఞానాన్ని సమూలంగా ప్రక్షాళన చేసేందుకు బ్రహ్మర్షి పితామహ సుభాష్ పత్రీజీ పీఎస్ఎస్ఎంను స్థాపించినట్లు తెలిపారు. ఈ లక్ష్యంలో భాగంగానే శ్రీకాళహస్తి వాస్తవ్యులైన సుంచి మునిబాబు వసుధైక కుటుంబం పిరమిడ్ గృహస్థ ఆశ్రమాన్ని ఏర్పాటుచేసి ప్రాతఃకాల యాప్ ద్వారా సరైన ధ్యానంతో సజ్జన సాంగత్యం నిర్వహిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో కేవీ నాగేశ్వరరావు, కె.శివప్రసాద్, కె.యుగంధర్, ఎన్వీ బ్రహ్మం, సీహెచ్ సుబ్రహ్మణ్యం, నాగాంజనేయులు, కె.మోక్షలత, కె.పద్మావతి, కె.శ్రీలక్ష్మి, జీవీ కొండయ్య, రామ్, రాధిక, కె.పాండు రంగయ్య, సీహెచ్ సత్యనారాయణ పాల్గొన్నారు. సమావేశాల అనంతరం పట్టణంలో ప్లకార్డులతో ప్రదర్శన జరిపారు.

నేడు ఆరుంబాక నెల్లెమ్మ తల్లి తిరునాళ్ల

చెరుకుపల్లి: మండలంలోని ఆరుంబాక గ్రామంలో వేంచేసి యున్న నెల్లెమ్మ తల్లి అమ్మవారి తిరునాళ్ల మహోత్సవం శనివారం అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తిరునాళ్ల సందర్భంగా ఆలయానికి వచ్చే భక్తులు మొక్కులు తీర్చుకునేందుకు ఆలయ ప్రాంగణంలో కమిటీ వారు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా ఆరుంబాక గ్రామ పంచాయతీ పరిధిలోని వివిధ గ్రామాల్లో పలు విద్యుత్ ప్రభలు, డప్పు వాయిద్యాలతో విన్యాసాలు, పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని, కావున భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకొని కృపా కటాక్షాలు పొందాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలి



భట్టిప్రోలు: మండలంలోని అన్ని గ్రామాలలో పీఎంఏవై, ఎన్టీఆర్ కాలనీలు, సొంత స్థలాల్లో 2019–24 మధ్య మంజూరైన గృహాలను మే నెలలోపు పూర్తి చేయాలని మండల ప్రత్యేక అధికారి వేణుగోపాల్ అన్నారు. శుక్రవారం భట్టిప్రోలు మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్, ఫీల్డ్ అసి స్టెంట్‌లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో ప్రభుత్వం అందించిన రూ.1.80 లక్షలు ఇంటి నిర్మాణానికి సరిపోక చాలామంది లబ్ధిదారులు గృహాలు నిర్మించుకోలేదని తెలిపారు. ఇప్పుడు వీటికి అదనంగా బీసీ, ఎస్సీలకు రూ.50 వేలు, ఎస్టీలకు రూ.75 వేలు అందచేయడం జరుగుతుందన్నారు. అలాగే డ్వాక్రా సభ్యులకు సున్నా వడ్డీతో రూ.35 వేలు రుణం, ఉచిత ఇసుక సరఫరా చేయడం జరుగుతుందన్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పనిచేసి లబ్ధిదారులకు అవగాహన కల్పించి లక్ష్యాలను పూర్తి చేసేలా పని చేయాలన్నారు. సమావేశంలో ఎంపీడీవో ఎస్.వెంకటరమణ, హౌసింగ్ ఏఈ సౌమ్య, ఏపీవో పార్వతి, ఇన్‌చార్జ్ ఈవోపీఆర్డీ కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అంతా దృశ్య కాలుష్యమే!

- మితిమీరిన ప్రచార ఫ్లెక్సీలు/హోర్డింగులు
- అనధికార ఫ్లెక్సీలు, వాల్‌బోర్డులదే రాజ్యం
- మున్సిపల్ స్థలాలు, కూడళ్లలో తిష్టవేస్తున్న వైనం
- రాజకీయ నేతలు, వ్యాపార సంస్థలు, ఆసుపత్రులు సైతం
- నెలల తరబడి ఉంటున్నా పట్టించుకోని మున్సిపాలిటీ





పట్టణ కూడళ్లలో అనధికార ఫ్లెక్సీలు

తెనాలి: ప్రచారంలో వినియోగించే మైకు శబ్దం కొన్ని డెసిబుల్స్‌కు పరిమితమై ఉండాలి... లేకుండా శబ్దకాలుష్యం కిందకు దారితీస్తుంది... ఇదే అంశం రోడ్లవెంట ఫ్లెక్సీలు, హోర్డింగులకూ వర్తిస్తుంది... రోడ్డు మనదే కదా... తోసేయ్..! అన్నట్టుగా ప్రచార ఫ్లెక్సీలు, వాల్‌బోర్డులు, హోర్డింగులు మితిమీరితే అందంగా, అకర్షణీయంగా ఉండదు సరికదా! దృశ్య కాలుష్యంతో జనానికి చీదర పుడుతుంది. ఆంధ్రాప్యారిస్ తెనాలిలో కొంతకాలంగా ఇలాంటి దృశ్య కాలుష్యం స్థానికులకు విసుగు పుట్టిస్తోంది. వీటిలో అనధికార ప్రచార ఫ్లెక్సీలతోనే ఈ తంటా సుమా! సెలక్షన్ గ్రేడ్ హోదాకు ఎదిగిన తెనాలి పట్టణం, ఆ హోదాను అనధికార కార్యకలాపాలను అడ్డుకోవటంలో చూపటం లేదనే విమర్శలున్నాయి. వీటిలో రోడ్ల ఆక్రమణలు ఒకటి. రోడ్డు పక్కన ఓ చిన్నషాపును అద్దెకు తీసుకోవటం, మార్జిన్లలో ఏకంగా హోటళ్లనే పెడుతున్నా పట్టించుకోవటం లేదు. ఇళ్లు, అపార్టుమెంట్లను నిర్మిస్తూ మెట్లు, ర్యాంప్‌లను మార్జిన్లు అతిక్రమించి రోడ్డును తాకేస్తుంటాయి. అయినా అధికారులకు పట్టదు. అలాగే అనధికార ఫ్లెక్సీలు, వాల్‌బోర్డులు, హోర్డింగులు కూడా ఇదే దారిలో వెలుస్తున్నాయి. పట్టణంలో అధికారిక హోర్డింగులు, వాల్‌బోర్డులు కలిపి కేవలం 395 ఉంటాయి. వీటిలో 119 వాల్‌బోర్డులుంటాయి. వీటి నుంచి ఏటా రూ.20 లక్షల ఆదాయం సమకూరుతోంది. అనధికార బోర్డులు కొన్ని వందలు ఉంటాయంటే అతిశయోక్తి కాదు. వీటిని నియంత్రించే పరిస్థితి కనిపించడం లేదు. ఓ చోటా రాజకీయ పార్టీ నాయకుడు ఉంటాడు... అతడు నివసించే కూడలి ప్రదేశంలో విద్యుత్ స్తంభాలు, డివైడరు మధ్యలో స్తంభాలు అతడిష్టం. అతడి పుట్టిన రోజుకు, ఆయన అభిమానించే రాజకీయ నేతకు రాసిచ్చేసినట్టే ఉంటుంది. పుట్టినరోజు, ఎన్నికల ప్రచారం, పండుగ రోజులకు శుభాకాంక్షల వాల్ బోర్డులు, ఫ్లెక్సీలతో నిండిపోతాయి. ఎవరికి వారు ఫ్లెక్సీల ఏర్పాటుతోనే తమ ఆధిక్యాన్ని ప్రదర్శించుకునే ధోరణి ఇందుకు దారితీస్తోంది. భారీ హోర్డింగులను మూడు నెలలు, ఆరు నెలలు, ఏడాది చొప్పున వ్యాపార దుకాణాలవారు అద్దెకు తీసుకుంటారు. అక్కడ తమ వ్యాపారానికి సంబంధించిన ఫ్లెక్సీని ఆ హోర్డింగుపై ఉంచుతారు. మధ్యలో ఏదొక రాజకీయ పార్టీ నేత పుట్టినరోజు వస్తుంది... ఎన్నికల ప్రచారం కావొచ్చు.... సంబంధిత వ్యాపారిని /యాడ్ ఏజెన్సీని ఏమాత్రం సంప్రదించకుండానే, తెల్లారేసరికల్లా ఆ హోర్డింగ్‌పై రాజకీయ ప్రచార ఫ్లెక్సీలు వెలుస్తుంటాయి. క్రమం తప్పకుండా యాడ్ ఏజెన్సీల నుంచి ముక్కుపిండి ప్రకటనల పన్ను వసూలుచేసే మున్సిపల్ అధికారులు వీటి జోలికి వెళ్లరు. యాడ్ ఏజెన్సీలు, వ్యాపార సంస్థలకు కలిగే అసౌకర్యాన్నీ, నష్టాన్నీ ఏమాత్రం పట్టించుకోవటం లేదు. రాజకీయ నాయకులను చూసి కొందరు డాక్టర్లు, ప్రైవేటు ఆసుపత్రుల నిర్వాహకులు కూడా ప్రచార పర్వంలో హద్దులు దాటేస్తున్నారు. గుంటూరు, విజయవాడ వంటి నగరాలకు చెందిన ప్రముఖ యాడ్ ఏజెన్సీల హోర్డింగులకు ఈ బెడద ఉండదు. కేవలం స్థానికంగా ఉండే యాడ్ ఏజెన్సీల నిర్వాహకులనే వీరు ఇబ్బందులు పెడుతుంటారు.

అనధికార బోర్డులు తొలగిస్తున్నాం



మున్సిపల్ స్థలం/ఆక్రమిత ప్రదేశాల్లో ఫ్లెక్సీలు లేదా హోర్డింగులు పెడితే ఆక్రమణ పన్ను, ప్రకటనల పన్ను వసూలు చేస్తాం. లైటింగుతో ఉన్నవాటికి అదనంగా పన్ను ఉంటుంది. అనధికారికంగా ఎవరైనా ఏర్పాటు చేస్తే, మున్సిపాలిటీకి ఇబ్బంది లేకపోతే దరఖాస్తు చేయించి, పన్ను విధిస్తాం. ఇబ్బంది అనిపిస్తే తొలగిస్తాం. ఎవరైనా తప్పనిసరిగా అనుమతి తీసుకోవాల్సిందే. అనధికార ఫ్లెక్సీలు, హోర్డింగులను తొలగిస్తున్నాం.

– టి.శివనారాయణ, అసిస్టెంట్ సిటీ ప్లానర్

ప్లాస్టిక్ ఇవ్వండి.. బహుమతి తీసుకువెళ్లండి

కమిషనర్ బండి శేషన్న

తెనాలిఅర్బన్: సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను నియంత్రించే కార్యక్రమంలో భాగంగా శనివారం పట్టణంలోని శివాజీ చౌక్, మున్సిపల్ కార్యాలయల వద్ద ప్లాస్టిక్ వస్తువుల సేకరణ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న ఒక ప్రకటనలో తెలిపారు. 120 మైక్రాన్‌లలోపు ఉన్న ప్లాస్టిక్ వస్తువులు, సంచులను కేజీ తెచ్చి కలక్షన్ పాయింట్‌లలో ఇచ్చి (కేజీ టమోటా, కేజీ పంచదార, కేజీ సేమ్యా, ఆరు కోడిగుడ్లు, అరలీటరు పాలు) వీటిలో ఒక వస్తువును తీసుకువెళ్లాలని సూచించారు. ప్లాస్టిక్ నిషేధంపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు పోత్సహక బహుమతుల కార్యక్రమాన్ని చేపట్టినట్లు చెప్పారు.

కొనసాగుతున్న పునః ప్రతిష్ఠా మహోత్సవాలు

గొరిగపూడి(భట్టిప్రోలు): భట్టిప్రోలు మండల క్షేత్రంగా ప్రసిద్ధి గాంచిన గొరిగపూడి భ్రమరి దుర్గాదేవి సమేత నాగేశ్వరస్వామి దేవస్థానంలో జీవధ్వజ విమాన గోపుర శిఖర సహిత పునః ప్రతిష్ఠా మహోత్సవాలు శుక్రవారం జరిగాయి. ఈ నెల 16వ తేదీ వరకు కార్యక్రమాలు కొనసాగనున్నాయి. గొరిగపూడి గర్గపురిగా గ్రామ దేవత దేశమ్మ తల్లి దివ్య ఆశీస్సులతో ఫణికుమార్ ఆధ్వర్యంలో పూర్వ గ్రామ కరణం, పులిగడ్డ వారి వంశస్తుల సహాయ సహకారాలతో బ్రహ్మశ్రీ సృజన్ కుమార్ ఆధ్వర్యంలో ఆచార్య అర్చక పర్యవేక్షణలో పూజలు జరుగుతున్నాయి.

పరిమళించిన మానవత్వం

అనాథ శవాన్ని మార్చురీకి తరలించిన సేవా సమితి సభ్యులు



అనాథ శవాన్ని మార్చురీకి తరలిస్తున్న సభ్యులు

తెనాలిఅర్బన్: అనాథ శవాన్ని తెనాలిలోని శ్రీశివ లింగేశ్వర స్వామి భక్తబృంద సేవా సమితి సభ్యులు జిల్లా వైద్యశాలలోని మార్చురికి తరలించారు. ఈసంఘటన తెనాలిలో శుక్రవారం జరిగింది. వివరాలలోకి వెళ్తే.. నెల్లూరుకు చెందిన విశ్రాంత పురావస్తు శాఖ ఉద్యోగి నూతలపాటి సుబ్రమణ్యం (74) తెనాలి నాజరుపేటలో అద్దెకు నివశిస్తున్నాడు. ఆయన కొద్దిరోజుల నుంచి ఇంటిలో నుంచి బయటకు రాలేదు. దీంతో ఇంటి నుంచి దుర్వాసన వస్తుండటంతో స్థానికులు ఒన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

విషయం తెలుసుకున్న ఎస్సై వై.సుబ్బయ్య అక్కడకి వచ్చి ఇంటిని పరిశీలించగా బాత్రూంలో విగత జీవిగా పడి ఉన్నాడు. అతడి శరీరంపై పురుగులు పాకుతూ ఉన్నాయి. అతడికి ఎవరు లేరని తెలియటంతో శ్రీ శివలింగేశ్వర స్వామి భక్త బృంద సేవా సమితి అధ్యక్షుడు కుర్రా శ్రీనుకు ఎస్సై ఫోన్ చేసి మార్చురీకి శవాన్ని తరలించాలని కోరారు. దీంతో సమితి సభ్యులు కుర్రా శ్రీను, అక్కల రమేష్, పోతురాజు, శివప్రసాద్‌లు దానిని జిల్లా వైద్యశాలలోని మార్చురికి తరలించారు.

18న జరిగే ధర్నాలో అందరు పాల్గొనండి



తెనాలిఅర్బన్: పెన్షనర్స్ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈనెల 18న గుంటూరులోని ఈపీఎఫ్ కార్యాలయం వద్దే నిర్వహించనున్న ధర్నాలో అందరు పాల్గొని జయప్రదం చేయాలని ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె శివశంకరరావు, కెబీ ప్రసాద్‌లు పిలుపునిచ్చారు. చెంచుపేటలోని ప్రజా సంఘాల కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ 1995లో కేంద్ర ప్రభుత్వం తెచ్చిన పెన్షన్ స్కీమ్ వల్ల కార్మికులు ఎంతో నష్టపోతున్నారని తెలిపారు. ప్రతినెల కార్మికుని జీతంలో 8.33 శాతంను ఈపీఎఫ్‌కు కడుతున్నట్లు చెప్పారు. 30 సంవత్సరాల నుంచి పాత పెన్షన్ పద్ధతి కొనసాగుతుందని, దీనివల్ల కార్మికులకు పెన్షన్ ఒక్క రూపాయి కూడా పెరగటం లేదని ఆరోపించారు. కనీస వేతనం కింద రూ.9000 ఇవ్వాలని కోరుతున్నా, ఇప్పటి వరకు ఆదిశగా కేంద్రం అడుగులు వేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో నాయకులు కుర్రా రమణ, షేక్ హుస్సేన్‌వలి, కె.దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

తెనాలిలో పెయింటర్ దుర్మరణం

తెనాలిరూరల్: డాబా మీద నుంచి పడి పెయింటర్ మృతి చెందిన ఘటన తెనాలిలో శుక్రవారం సాయంత్రం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పట్టణ పాండురంగపేటకు చెందిన కొండ్రు సాయికుమార్(20) పెయింట్ పనులకు వెళుతుంటాడు. చెంచుపేటోని ఓ భవనానికి పెయింట్ వేసేందుకు మూడో అంతస్తులో తాడు సాయంతో దిగాడు. తాడు తెగిపోవడంతో అక్కడి నుంచి పడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని తెనాలి జిల్లా వైద్యశాలకు తరలించారు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రత్యేక అలంకరణలో అమ్మవార్లు



భట్టిప్రోలు: భట్టిప్రోలు మండలం వెల్లటూరు గ్రామంలో ముగ్గురు తల్లులైన ముత్యాలమ్మ, కట్లమ్మ, మహాలక్ష్మమ్మ అమ్మవార్లకు ఫాల్గుణ పౌర్ణమి పురస్కరించుకుని శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ దేవతలైన అమ్మవార్లను భక్తులు సందర్శించారు. వేద బ్రాహ్మణులు క్రోవి రామకృష్ణ శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు.

ఘనంగా అమ్మవార్ల జయంతి

గజవాహనంపై ఊరేగిన అమ్మవార్లు



గజవాహనంపై అమ్మవార్లను ఊరేగిస్తున్న భక్తులు

తెనాలి: స్థానిక కొత్తపేటలోని శ్రీఅష్టలక్ష్మీ దేవాలయంలో అమ్మవార్ల 27వ జయంతి వేడుకను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. శ్రీదండిస్వామి మఠానుబంధమైన ఈ ఆలయంలో శ్రీదండిస్వాముల దివ్యాశీస్సులతో ఈ వేడుకను తెల్లవారుజామున నాలుగు గంటల నుంచి ప్రారంభించారు. మహాభిషేకంతో మొదలుపెట్టి, ఉదయం 8 గంటలకు ఆరగింపు సేవ, హారతి, 11 గంటలకు సహస్ర నామార్చన, హారతి, తీర్థప్రసాదాల వినియోగం జరిగింది. సాయంత్రం గజవాహనంపై అష్టలక్ష్మి అమ్మవార్ల ఊరేగింపు పురవీధుల్లో భారీగా జరిగింది. మంగళవాయిద్యాలు, మహిళల కోలాటంతో జగవాహనంపై ఊరేగింపుకు ముందుగా కుమార్ పంప్స్ ఛైర్మన్ కొత్త సుబ్రహ్మణ్యం, కృష్ణకుమార్, హరికుమార్‌లు నడిచారు. ఆలయ పూజారి శ్రీరామ్ చక్రవర్తి పూజావిధులను నిర్వహించారు. అనంతరం సాయంత్రం ఆరు గంటలకు ఎన్జీవో కల్యాణ మంటపంలో ఊంజల సేవ జరిగింది. నంబూరులోని కాళీ వనాశ్రమ పీఠాధిపతి శ్రీచంద్రకాళీప్రసాద్ మాతాజీ, పెదపులిపాక శ్రీ విజయ రాజరాజేశ్వరి విద్యాపీఠాధిపతులు వాసుదేవానందగిరి స్వామి, బళ్లారి శ్రీగురుగీత మందిరాధిపతులు నిత్యానంద భారతి స్వామి ప్రవచనం చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

వైభవంగా లక్ష్మీదేవి జన్మదిన వేడుకలు



రేపల్లె రూరల్: ఫాల్గుణ శుద్ధ పౌర్ణమి మహాలక్ష్మీదేవి జన్మదినాన్ని పురస్కరించుకుని పట్టణంలోని వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక వేడుకలను ఆలయ అర్చకులు నిర్వహించారు. వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారికి ఉదయం సుప్రభాత సేవ, ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. మహిళలు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శనం చేసుకున్నారు. ఆలయ ఆవరణలో మహిళలు లలితా, విష్ణు సహస్ర నామ పారాయణతో పాటు వివిధ భక్తి గీతాలను ఆలపించారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

తప్పుడు కేసులు ఎదుర్కోవడానికి సిద్ధం

- వైఎస్సార్‌సీపీ శ్రేణులకు కష్టం వస్తే అండగా ఉంటాం
- కక్షపూరిత రాజకీయాలు ఎంతోకాలం సాగవు
- ప్రజల పక్షాన పోరాటానికి అందరూ సిద్ధం కావాలి
- మంగళగిరి నియోజకవర్గ పార్టీ సమన్వయకర్త వేమారెడ్డి



మాట్లాడుతున్న దొంతిరెడ్డి వేమారెడ్డి

తాడేపల్లి రూరల్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలపై పెడుతున్న తప్పుడు కేసులను ఎదుర్కోవడానికి పార్టీ ఎప్పుడూ సిద్ధంగా ఉంటుందని మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి (డీవీఆర్) అన్నారు. క్లిష్ట పరిస్థితుల్లో ఉన్న శ్రేణులను ఆదుకుంటామని తెలిపారు. ప్రశ్నించిన ప్రజలపై జరుగుతున్న దాడులను ఎదుర్కొనేందుకు అందరం సిద్ధంగా ఉండాలని పేర్కొన్నారు. శుక్రవారం తాడేపల్లి రూరల్ పరిధిలోని ఉండవల్లిలో రూరల్ అధ్యక్షుడు అమరా నాగయ్య ఆధ్వర్యంలో ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన దొంతిరెడ్డి వేమారెడ్డి మాట్లాడుతూ పార్టీ వారిపై కొంతమంది అక్రమ కేసులు పెడతామని బెదిరింపులకు పాల్పడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. వాటిని ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. బెదిరింపు రాజకీయాలు ఎంతోకాలం పనిచేయమని, అలాంటి వారు శాశ్వతంగా రాజకీయాలకు దూరం అవుతారని అన్నారు. వారి గురించి మనం ఆలోచించాల్సిన అవసరం లేదని తెలిపారు. భవిష్యత్తులో వాడవాడలా వైఎస్సార్‌సీపీని బలోపేతం చేసేందుకు కమిటీలు వేస్తున్నామని పేర్కొన్నారు. ఎక్కడ ఏం జరిగినా వెంటనే సంబంధిత నాయకులు న్యాయపోరాటం చేసేందుకు సిద్ధంగా ఉండాలని తెలిపారు. కూటమి ప్రభుత్వం సూపర్‌సిక్స్ పేరుతో అనేక హామీలు ఇచ్చి వాటిని నెరవేర్చలేకపోయిందని విమర్శించారు. ప్రశ్నించే ప్రజలపై, నాయకులపై తప్పుడు కేసులు పెడుతున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ తాడేపల్లి రూరల్ అధ్యక్షుడు పాటిబండ్ల కృష్ణమూర్తి, ఉండవల్లి పార్టీ అధ్యక్షుడు దంటు గోవర్ధనరెడ్డి, మున్నంగి శ్రీధర్‌రెడ్డి, సీనియర్ నాయకులు కళ్ళం రాజశేఖరరెడ్డి, మేకా హనుమంత ప్రసాద్ యాదవ్, సిగిరిశెట్టి శ్రీకాంత్, ఉండవల్లి అశ్వని మాస్టర్, సంకురు సుకుమార్, ప్రేమ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

దుగ్గిరాల: వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు అధినాయకత్వం ఎల్లప్పుడు అండగా ఉంటుందని పార్టీ మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని ఈమని, మోరంపూడి, పేరకలపూడి గ్రామాలలో శుక్రవారం పార్టీ క్రియశీల కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ముందుగా దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కమ్యూనిస్టు నేత సువార్తమ్మ పోరాటం స్ఫూర్తిదాయకం

సంతాపసభలో వక్తల నివాళి



మాట్లాడుతున్న మాణిక్యాలరావు

తెనాలి: పట్టణానికి చెందిన కమ్యూనిస్టు నేత, తెనాలి తాలూకా మహిళా సమాఖ్యలో ప్రముఖ పాత్రను పోషించిన వేము సువార్తమ్మ చిరస్మరణీయులని శుక్రవారం సాయంత్రం జరిగిన సంతాప సభలో నివాళులర్పించారు. ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి, గుంటూరు జిల్లా శాఖ ఆధ్వర్యంలో స్థానిక గాంధీనగర్‌లోని భారత సాంస్కృతిక సహకార స్నేహసంఘం (ఇస్కఫ్) హాలులో జరిగిన సభకు ప్రజానాట్యమండలి తెనాలి అధ్యక్షుడు మాణికల్యారావు అధ్యక్షత వహించారు. ఇస్కఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బొల్లిముంత కృష్ణ మాట్లాడుతూ వేము సువార్తమ్మ జీవితం, పోరాటాన్ని వివరించారు. కమ్యూనిస్టు క్రియాశీల కార్యకర్తగా, బుర్రకథ కళాకారిణిగా ప్రజాచైతన్యానికి ఆమె పాటుపడిన తీరును వివరించారు. ఆమె పోరాటస్ఫూర్తి, చైతన్యం స్ఫూర్తిదాయకమన్నారు. అభ్యుదయ రచయితల సంఘం (అరసం) జిల్లా నాయకుడు కనపర్తి బెన్‌హర్, ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి దేవరపల్లి నీలాంబ్రం, శ్రీదేవి, నాగమణి, సువర్చల తదితరులు మాట్లాడారు. తొలుత సువార్తమ్మ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు.

నేటి నుంచి నగరేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు



ఆహ్వానపత్రికను ఆవిష్కరించిన కమిటీ నాయకులు

తెనాలి: పట్టణ బోసురోడ్డులోని శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానంలోని వింధ్యవాసినీ సమేత శ్రీనగరేశ్వరస్వామి అష్టమ వార్షిక బ్రహ్మోత్సవాలు ఈనెల 15వ తేదీనుంచి 17వ తేదీ వరకు మూడురోజులపాటు జరగనున్నాయి. ఆలయ కమిటీ నేతలు శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆహ్వానపత్రికను ఆవిష్కరించి, వివరాలను తెలియజేశారు. ఇదే సందర్భంగా ఆలయ కమిటీ సర్వసభ్య సమావేశం ఏప్రిల్ 13న ఉదయం 11.45 గంటలకు జరుగుతుందని కమిటీ నాయకులు తెలియజేశారు. ఆరోజు ఆలయ ప్రాంగణంలోని వక్కలగడ్డ రామమోహనరావు, వెంకటరత్నమ్మ కల్యాణమండపం కమిటీ అధ్యక్షుడు నూకల వెంకట వేణుగోపాలరావు అధ్యక్షత సమావేశం జరుగుతుందని తెలిపారు. మార్చి నెలాఖరు వరకు జమా ఖర్చులను పరిశీలించి, ఆమోదించటం, రాబోయే సంవత్సరాలకు నూతన పాలకవర్గంపై చర్చించి నిర్ణయించటం, వెండి రథం తయారీపై చర్చించటం, అధ్యక్షుల అనుమతితో ఇతర అంశాలపై చర్చించటం సమావేశపు అజెండాగా తెలియజేశారు. గ్రంధి విశ్వేశ్వరరావు, నూకల భాస్కరరావు, వక్కలగడ్డ గంగాధరరావు, ఆకి అచ్యుతరావు, మద్దాళి శేషాచలం, వుప్పల వరదరాజులు, గోపు రామకృష్ణ, కొణిజేటి శంకరరావు, అన్నవరపు నరసింహారావు, గౌడవర్తి సాయిహరేరామ్, నుదురుపాటి రామకోటేశ్వర శర్మ, అర్చకుడు రొంపిచర్ల మారుతీ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

•రంగులు చల్లుకుని...



హోలీ వేడుకలను తెనాలిలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలో సుల్తానాబాద్, చినరావూరు, బుర్రిపాలెం రోడ్డులో కొందరు యువకులు, చిన్నారులు రంగులు పూసుకుంటూ సందడి చేశారు. –తెనాలిఅర్బన్

ఆశీలు వేలం వాయిదా

రేపల్లె రూరల్: రేపల్లె మున్సిపాలిటీలో 2025–26 సంవత్సరానికి కూరగాయల మార్కెట్, రోడ్డు మార్జిన్, కబేళ, విక్టోరియా సత్రంకు సంబంధించిన మూడు పొలాలు, మార్కెట్ ఆశీలులకు సంబంధించి ఆశీలు వసూలు చేసుకునేందుకు ఈ నెల 17వ తేదీన నిర్వహించే వేలం పాటను పరిపాలన పరమైన కారణాల నేపథ్యంలో ఎగ్జిక్యూటివ్ అథారిటీ ఆదేశాల మేరకు వాయిదా వేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ కాకర్ల సాంబశివరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బహిరంగ వేలం నిర్వహించే తేదీని త్వరలో ప్రకటించటం జరుగుతుందని పేర్కొన్నారు.

నాటక ప్రదర్శన



భట్టిప్రోలు: ప్రతి ఏటా భట్టిపోలు భ్రమరాంబ మల్లేశ్వర స్వామి ప్రాంగణంలో గుంటూరు వారిచే భేతా వెంకట్రావు నాటక కళా మందిర్ శ్రీకృష్ణ రాయబారం పౌరాణిక పూర్తి నాటకం, మండలంలోని పెదపులివర్రు శ్రీ భూ నీలా సమేత వరదరాజస్వామి దంపతుల ప్రాంగణంలో పొన్నూరు వారిచే విఘ్నేశ్వర నాట్యమండలి సత్య హరిశ్చంద్ర పౌరాణిక నాటకం ప్రదర్శిస్తున్నారు. ఈ సందర్భంగా భట్టిప్రోలుకు చెందిన ఉక్కడాల ఆనంద్ రూ.10 వేలు అందచేశారు. కార్య నిర్వహణాధికారులు శనగవరపు కుమార్ బాబు, ఇ.సాంబశివరావులు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.